క్లుప్తంగా

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ



బ్యాగులు పంపిణీ చేస్తున్న దృశ్యం

అచ్యుతాపురం : మండలంలోని మల్లవరం, నరేంద్రపురం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో సర్పంచ్ పిన్నమరాజు వాసు చేతుల మీదుగా శనివారం బ్యాగుల పంపిణీ జరిగింది. కార్యక్రమంలో రావి శోభన్‌బాబు, చందక శివ, రావి నాయుడు, రావి కాసుబాబు, కిలాడి చినబాబు పాల్గొన్నారు.

పక్కాగా పంటల గణాంకాలు



మాట్లాడుతున్న తహసీల్దార్ పాపారావు

మునగపాక : పంటల నమోదుకు సంబంధించి గణాంకాలు పూర్తి స్థాయిలో సేకరించాలని తహసీల్దార్ పాపారావు కోరారు. మునగపాక రెవెన్యూ కార్యాలయంలో శనివారం వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రెవెన్యూ గ్రామ పరిధిలో రైతులు ఎంత విస్తీర్ణంలో ఏ పంట వేశారనే వివరాలు సేకరించాలన్నారు.పంటల నమోదుకు సంబంధించిన గణాంకాలు పక్కాగా సేకరించాలన్నారు. ప్రతి వీఆర్వో బాధ్యతగా వివరాలు సేకరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గణాంకాధికారి చంద్రమౌళి పాల్గొన్నారు.

ఏపీ పీజీ సెట్ స్టేట్ ర్యాంకర్ వెంకటేష్‌కు సత్కారం



వెంకటేష్‌ను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

రాంబిల్లి : ఏపీ పీజీ సెట్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 15వ ర్యాంకు సాధించిన పులిగా వెంకటేష్‌ను శనివారం దిమిలిలో యూనిక్ స్కూల్ ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఈ పాఠశాలలో చదువుకున్న వెంకటేష్ రాష్ట్ర స్థాయిలో 15వ ర్యాంకు సాధించడం అభినందనీయమని ఉపాధ్యాయులు కొనియాడారు. తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు అయినప్పటికీ నిరుత్సాహ పడకుండా వెంకటేష్ కష్టపడి చదివి ర్యాంకు సాధించడం అభినందనీయమని కరస్పాండెంట్ బి.అప్పారావు అన్నారు. ఇలాంటి వారిని స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు బాగా చదువుకోవాలన్నారు.

ఒరిగిన విద్యుత్ స్తంభాలతో రైతుల ఆందోళన



చూచుకొండలో ఒరిగిపోయిన విద్యుత్ స్తంభం

మునగపాక : మండలంలోని చూచుకొండలో విద్యుత్ స్తంభాలు పలు చోట్ల ఒరిగిపోయాయి. దీంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. రైతుల కమతాల్లో విద్యుత్ సరఫరాకు అవసరమయ్యేలా అధికారులు గతంలో స్తంభాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం పలు చోట్ల స్తంభాలు ప్రమాదకరంగా మారాయి. ఎపుడు నేల కొరిగిపోతాయోనన్న ఆందోళన రైతుల్లో నెలకొంది. ఇప్పటికే పలుమార్లు సంబంధిత అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని రైతులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పాయకరావుపేట : ప్రభుత్వ ఐటీఐలో 2024–25 సంవత్సరానికి అడ్మిషన్లు కొరకు (రెండో విడత) దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ కె.సత్యనారాయణ తెలిపారు. అభ్యర్థులు అన్ని ధ్రువ పత్రాలతో ఐటీఐ వైబ్‌సైట్‌లో జూలై 24వ తేదీలోగా ఐటీఐ నందు రిజిస్ట్రేషన్ చేయించుకుని, సర్టిఫికేట్ వెరిఫికేషన్ చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ కొరకు ఒరిజినల్ సర్టిఫికేట్‌లతో హాజరు కావాలన్నారు. అభ్యర్థులకు కౌన్సెలింగ్ జూలై 27న చేయడం జరుగుతుందని ప్రిన్సిపాల్ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు.

తరగతికి ఒక్కరు..బడికి ఐదుగురే..!

- విద్యార్థులు ప్రైవేటు స్కూళ్ల బాట
- చినబొడ్డేపల్లిలోని ఎంపీపీ స్కూల్ దుస్థితి



ఐదుగురు విద్యార్థులకు బోధన చేస్తున్న హెచ్‌ఎం అర్జున్



చినబొడ్డేపల్లిలోని ఎంపీపీ స్కూల్

కోటవురట్ల : ఆ బడిలో పంచ పాండవుల్లా ఐదుగురే విద్యార్థులు. ఒక్కో తరగతికి ఒకరు చొప్పున ఐదు తరగతులకు ఐదుగురు విద్యార్థులే విద్యను అభ్యసిస్తున్నారు. ఇది ఎక్కడో కాదు మండలంలోని చినబొడ్డేపల్లి గ్రామంలోని ఎంపీపీ స్కూల్లోని పరిస్థితి. గత ప్రభుత్వంలో ఓ వెలుగు వెలిగిన ప్రభుత్వ పాఠశాలలు ఇపుడు విద్యార్థులను వెతుక్కోవలసిన దుస్థితి నెలకొంది. ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం లేక విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు తీసుకెళ్లిపోతున్నారు. దాంతో ఒక్కో పాఠశాల పూర్వ వైభవాన్ని కోల్పోతున్నాయి. గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పిల్లలకు బంగారు భవిష్యత్‌ను ఇవ్వాలనే ఆలోచనతో నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలను అద్భుతంగా అభివృద్ధి చేశారు. పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించి విద్యార్థులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దారు. జగన్న విద్యా దీవెన కిట్లు అందజేసి జగనన్న గోరుముద్ద ద్వారా మంచి ఆహారాన్ని అందించారు. నాణ్యమైన విద్య అందేలా ఆంగ్లమాధ్యమాన్ని ప్రవేశపెట్టి విద్యా వ్యవస్థను ఓ గాడిలో పెట్టారు. దాంతో గతంలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ప్రస్తుత పరిస్థితి అందుకు విరుద్ధంగా మారింది. ఇలా ప్రభుత్వం మారిందో లేదో ఆ ప్రభావం ప్రభుత్వ పాఠశాలలపై పడింది. చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. అందుకు ఉదాహరణగా చినబొడ్డేపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నిలిచింది. ఇక్కడ హెచ్‌ఎం ఆర్.అర్జున్ ఉండగా ఐదు తరగతులకు ఐదుగురే విద్యార్థులు ఉన్నారు. గతంలో ఇక్కడ 8 మంది విద్యార్థులు ఉండగా నలుగురు విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలకు మారిపోయారు. కొత్తగా ఒకరు చేరడంతో ప్రస్తుతం ఐదుగురు విద్యార్థులతో పాఠశాల నడుస్తోంది. ఐదు తరగతులకు చెందిన ఐదుగురు విద్యార్థులకు హెచ్‌ఎం అర్జున్ విద్యా బోధన చేస్తున్నారు. నాణ్యమైన విద్యను అందిస్తాం.. మీ పిల్లలను మన బడిలో చేర్పించండి అంటూ హెచ్‌ఎం అర్జున్ కోరుతున్నారు.

విద్యాప్రమాణాలు పెంపొందేలా ప్రభుత్వ బడుల నిర్వహణ



పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయుడ్ని సత్కరిస్తున్న ఎంఈవో, హెచ్‌ఎంలు



ప్రధానోపాధ్యాయులకు సూచనలిస్తున్న ఎంఈవో మీనాక్షి

యలమంచిలి రూరల్ : ప్రభుత్వ ఆధీనంలో నడుస్తున్న పాఠశాలల నిర్వహణ నిబంధనల ప్రకారం సక్రమంగా ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులపై ఉందని మండల విద్యాశాఖాధికారి 1 వై మీనాక్షి అన్నారు. శనివారం సాయంత్రం యలమంచిలి ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె పాఠశాలల నిర్వహణకు సంబంధించిన అనేక అంశాలు, ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యక్రమాలపై దిశా నిర్దేశం చేశారు. ముఖ్యంగా బడికి పోదాం, మధ్యాహ్న భోజన పథకం పీఎం పోషణ, బేస్ లైన్ టెస్ట్, స్టూడెంట్స్ కిట్లు, టీఎంఎఫ్ నిర్వహణ, పాఠశాలల అకడమిక్ సంబంధిత అంశాలపై చర్చించారు. నాణ్యమైన విద్య అందించి విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు పెంపొందించాలని సూచించారు. ముఖ్యంగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు నిత్యం సమయపాలన పాటించాలన్నారు. అనంతరం మే, జూన్ నెలల్లో పదవీ విరమణ చేసిన, చేయనున్న ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు ఏవీ హెచ్ శాస్త్రి, పులపర్తి జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం కె.శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

1న ఇంటి వద్దనే పింఛన్ల పంపిణీ

- సచివాలయ ఉద్యోగుల ద్వారా ఉదయం 6 గంటల నుంచి పంపిణీ ప్రారంభం
- 8559 మంది లబ్ధిదారులకు రూ.5.58 కోట్ల విడుదల



విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీడీవో మన్మథరావు

మునగపాక : మండల వ్యాప్తంగా జూలై 1న ఉదయం 6 గంటల నుంచి పింఛన్ల పంపిణీ జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్టు ఎంపీడీవో ఎం .మన్మథరావు తెలిపారు. పెరిగిన పింఛన్ సొమ్మును లబ్ధిదారులకు సచివాలయ ఉద్యోగుల ద్వారా అందజేస్తామన్నారు. మండలంలోని 8559 మంది లబ్ధిదారులకు 5 కోట్ల 58లక్షల 29వేల మేర నగదును సిద్ధం చేశామన్నారు. సచివాలయ పరిధిలోని ఉద్యోగి ఒక్కొక్కరికి 50 కుటుంబాల వంతున పింఛన్ అందజేసేలా ప్రణాళికలు చేశామన్నారు. అరబుపాలెంలో 264 మంది, చెర్లోపాలెంలో 323, చూచుకొండలో 429, గణపర్తిలో 380, గంటవానిపాలెంలో 205, మెలిపాకలో 373, మునగపాక–1లో 752, మునగపాక–2లో 783, నాగవరంలో 493, నాగులాపల్లి–1లో 358, నాగులాపల్లి–2లో 414, పల్లపు ఆనందపురంలో 213, పాటిపల్లిలో 406, రాజుపేటలో 467, టి.సిరసపల్లి–1లో 378, టి.సిరసపల్లి–2లో 161, తిమ్మరాజుపేటలో 422, తోటాడలో 773, ఉమ్మలాడలో 404, వాడ్రాపల్లిలో 354, ఒంపోలులో 357 మందికి పింఛన్లు అందజేయనున్నామన్నారు.

4338 మందికి పింఛన్

యలమంచిలి రూరల్ : మండలంలో 4338 మందికి సామాజిక భద్రతా పింఛన్లను జూలై 1,2 తేదీలో పంపిణీ చేస్తామని ఎంపీడీవో అప్పలనాయుడు మీడియాకు తెలిపారు. పెంచిన మొత్తంతో లబ్ధిదారులకు సొమ్ము అందజేయడానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పింఛను సొమ్మును లబ్ధిదారులకు అందజేస్తారన్నారు. ఇందుకోసం మండలంలో 10 సచివాలయాల్లో సుమారు 70 మంది సచివాలయ సిబ్బందిని నియమించామన్నారు. లబ్ధిదారులకు రూ.2,83,54,500 నగదు అందజేస్తామన్నారు. మండలంలోని పోతురెడ్డిపాలెం,పులపర్తి గ్రామాల్లో ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ చేతుల మీదుగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు.

అధ్వాన రహదారితో ఇక్కట్లు



దారుణంగా ఉన్న అన్నవరం రహదారి

కోటవురట్ల : గ్రామీణ రహదారులు దారుణ స్థితిలో ఉన్నాయి. ప్రస్తుత వర్షాలకు విశ్వరూపం చూపిస్తున్నాయి. మండలంలో గత ప్రభుత్వంలో సుమారు రూ.15 కోట్లు వెచ్చించి పలు రహదారులను అభివృద్ధి చేశారు. ఐదేళ్లలో ఒక్కో రహదారిని అభివృద్ధి చేస్తూ వచ్చారు. ఇంకా పలు రహదారులు అభివృద్ధి చెందకపోవడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. యండపల్లి జంక్షన్ నుంచి అన్నవరం వెళ్లే రహదారి చాలా వరకు శిథిలమైంది. పెద్ద పెద్ద గోతులు పడి దారుణంగా తయారైంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గోతుల్లో నీరు చేరి వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రాత్రి వేళల్లో ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి రహదారులను అభివృద్ధి చేయాలని పలువురు కోరుతున్నారు.

ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు సేవలు ఆదర్శనీయం



శ్రీనివాసరావుని సత్కరిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం : అచ్యుతాపురం ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయునిగా పనిచేసిన శ్రీనివాసరావు ఎంతో ఆదర్శనీయులని ఎంఈవో దేవరాయలు అన్నారు. సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయునిగా పని చేసిన శ్రీను పని పట్ల నిబద్ధత, విద్యార్థులకు ఎంతో చక్కగా తీర్చిదిద్దారని తెలిపారు. ఈ నెల 30న పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో శనివారం పాఠశాలలో శ్రీనివాసరావుకు సత్కారం చేశారు.ఈ సందర్భంగా ఎంఈవో దేవరాయలు మాట్లాడుతూ పదవీ విరమణ పొందిన శ్రీనివాసరావు శేష జీవితం ప్రశాంతంగా సాగాలని ఆకాంక్షించారు. హెచ్‌ఎం పద్మావతి, పూజారి చిన్నబాబు, శ్రీరామమూర్తి, శాస్త్రి, నూకరాజు, చిరంజీవి పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉపాధ్యాయినికి ఘన సత్కారం



పదవీ విరమణపొందిన ఉపాధ్యాయులను సత్కరిస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం : పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులు శేష జీవితం సుఖమయంగా గడపాలని యలమంచిలి డిప్యూటీ డీఈవో పి.అప్పారావు అన్నారు. గుడివాడ ఉన్నత పాఠశాలలో బయాలజీ ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న కె.సుబ్బలక్ష్మి ఈ నెల 30 న పదవీ విరమణ చేయడంతో శనివారం పాఠశాలలో వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. సుబ్బలక్ష్మి దంపతులను సత్కరించి ఉద్యోగ జీవితంలో ఆమె అందించిన సేవలను కొనియాడారు. పదవీ విరమణ ముందు ఆమె తన గుర్తుగా ప్రస్తుతం పనిచేస్తున్న పాఠశాలకు సొంత నిధులతో కొంత సామాగ్రిని అందించడం అభినందనీయమన్నారు. పాఠశాల ఉపాధ్యాయులతో పాటు పీఆర్‌టీయు ఉపాధ్యాయ సంఘ నాయకులు సుబ్బలక్ష్మి దంపతులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయు జిల్లా అధ్యక్షుడు గోపినాథ్, ప్రధానోపాధ్యాయులు నాగన్నదొర, పీఆర్‌టీయు మండల శాఖ అధ్యక్షుడు భద్రరావు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

వీఆర్ఏ సంఘ అధ్యక్షుడికి నివాళి



చిందాడ అప్పారావుకు శ్రద్ధాంజలి ఘటిస్తున్న వీఆర్ఏలు

ఎస్.రాయవరం : గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘ అధ్యక్షుడు చిందాడ అప్పారావు అందించిన సేవలు మరవలేనివని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు అన్నారు. ఇటీవల మృతి చెందిన వీఆర్ఏ సంఘ అధ్యక్షుడు చిందాడ అప్పారావుకు లింగరాజపాలెం గ్రామంలో శనివారం మండల వీఆర్ఏలు సంతాపం తెలియజేశారు. మండలంలో సుదీర్ఘంగా సేవలందించిన అప్పారావు సేవలు మరువలేమని కొనియాడారు.

సమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరించాలి



మండల సమావేశంలో ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్

రాంబిల్లి : సభ్యులు లేవనెత్తిన సమస్యలను సంబంధిత అధికారులు చిత్తశుద్ధితో పరిష్కరించాలని ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ ఆదేశించారు. శనివారం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ శిరీష అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే సభ్యులు లేవనెత్తిన సమస్యపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు మొక్కుబడిగా సమావేశాలకు రావద్దని హితవు పలికారు. సమావేశానికి హాజరుకాని అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ధూళి నాగరాజు, ఎంపీడీవో వెంకటాచలం, తహసీల్దార్ అప్పలస్వామి , పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

అతిసారపై అప్రమత్తత అవసరం



సర్వసిద్ధి గ్రామంలో అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న వైద్యురాలు శక్తిప్రియ

ఎస్.రాయవరం : అతిసార వ్యాధిబారిన పడకుండా ప్రతి ఒక్కరు జాగ్రత్తలు తీసుకోవాలని సర్వసిద్ధి పీహెచ్ సీ వైద్యాధికారులు శక్తిప్రియ, ఎస్.వాసంతి అన్నారు. వర్షాల సీజన్‌లలో కలుషిత తాగునీరు కారణంగా అతిసార ప్రబలే ప్రమాదం ఉందని ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా కర్రివానిపాలెం, సర్వసిద్ధి గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

హైస్కూల్ విద్యార్థులకు మినరల్ వాటర్ సదుపాయం



వాడ్రాపల్లి హైస్కూల్ విద్యార్థులకు మంచినీటి క్యాన్‌లు అందజేస్తున్న రాజేష్

మునగపాక : మండలంలోని వాడ్రాపల్లికి చెందిన ప్రొక్లయిన్ యూత్ అధ్యక్షుడు మళ్ల రాజేష్ తన ఔదార్యాన్ని చాటుకున్నారు. వాడ్రాపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు తాగేందుకు మినరల్ వాటర్ సదుపాయం లేకపోవడాన్ని గుర్తించారు. విద్యార్థులు ఆరోగ్యవంతంగా ఉండాలంటే తాగే మంచినీరు కూడా శుద్ధమైనది కావాలని ఇందుకోసం తన వంతుగా హైస్కూల్ విద్యార్థులకు అవసరమయ్యే మంచినీటి క్యాన్‌లను శనివారం అందజేసి ఔదార్యం చాటుకున్నారు. హైస్కూల్ హెచ్‌ఎం రత్నరాజుకు క్యాన్‌లు అందజేశారు. ప్రతి రోజు మినరల్ వాటర్ తాగేలా తగు చర్యలు తీసుకుంటామని రాజేష్ ముందుకు రావడం పట్ల ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు కూడా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తెగుళ్లపై రైతులు దృష్టి సారించాలి



మాట్లాడుతున్న శాస్త్రవేత్త రామలక్ష్మి

అనకాపల్లి : ఖరీఫ్ సీజన్‌లో వరి నారుమడులు వేసుకునే రైతులు తెగుళ్లు, పురుగులు, వ్యాధులపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త సీహెచ్ రామలక్ష్మి అన్నారు. మండలంలో బవులవాడలో వ్యవసాయ శాఖ, ఆత్మ సౌజన్యంతో ప్రధాన పంటల్లో సమగ్ర సస్య రక్షణపై రైతులకు శనివారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి నారుమడుల్లో యాజమాన్య పద్ధతులు, వరి నాడుమడులు వేసే విధానం, నారు మడిలో వచ్చే తెగుళ్లు, పురుగులు, సస్యరక్షణ పద్ధతుల గురించి వివరించారు. వర్షా కాలంలో విష సర్పాలపై దృష్టి పెట్టాలని, పొలాల్లోకి వెళ్లేటప్పుడు తప్పనిసరిగా కర్ర తీసుకెళ్లాలని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి పి.రంగాచారి మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల్లోనూ వరి విత్తనాల పంపిణీ జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి తులసి కుమారి, ఆత్మ ఏటీఎం పి. రామకృష్ణ, జిల్లా వనరుల కేంద్రం విస్తీర్ణ అధికారి సాయివాణి, బవులువాడ గ్రామ సర్పంచ్ మజ్జి లక్ష్మీ వెంకట అప్పారావు, ఎంపీటీసీ సభ్యుడు తోటాడ విజయ్, రైతు నాయకులు కోట్ని వెంకట సత్య ఈశ్వరరావు, మజ్జి అర్జున్‌రావు, రైతులు తదితరులు పాల్గొన్నారు

బడిఈడు పిల్లలంతా బడిలోనే ఉండాలి..



విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఎం అల్లావుద్దీన్

కోటవురట్ల : బడి ఈడు పిల్లలంతా బడిలోనే ఉండాలని హెచ్‌ఎం షేక్ అల్లావుద్దీన్ అన్నారు. కె.వెంకటాపురంలోని జెడ్పీ హైస్కూల్‌లో పేరెంట్ కమిటీ సభ్యులతో శనివారం సమావేశం నిర్వహించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు. ప్రైవేటు పాఠశాలల మోజుతో పిల్లల చదువులకు రూ.లక్షలు వదిలించుకోవద్దన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు సరైన నిర్ణయం తీసుకోవాలన్నారు. బడి వయస్సు వచ్చిన పిల్లలను పనిలో పెట్టకుండా బడికి పంపించి విద్యను అందేలా కృషిచేయాలని కోరారు.

లోక్ అదాలత్‌లో 112 కేసులు పరిష్కారం

యలమంచిలి రూరల్ : జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా శనివారం యలమంచిలి సబ్ కోర్టు ఆవరణలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో 112 కేసులు పరిష్కారమయ్యాయి. వీటిలో సివిల్, క్రిమినల్, ప్రీలిటిగేషన్ కేసులున్నాయి. లోక్ అదాలత్ సందర్భంగా స్థానిక న్యాయస్థానాల ప్రాంగణంలో కక్షిదారులు, పోలీసులు, న్యాయవాదులతో కోలాహలం నెలకొంది. సీనియర్ సివిల్ జడ్జి పేపకాయల విజయ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పొట్ల స్వాతి భవానీ. ఏజేఎఫ్ సీఎమ్ కోర్టు న్యాయమూర్తి టి.వీర రాఘవేంద్రరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ లోక్ అదాలత్‌లో యలమంచిలి బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ధూళి నూకరాజు, పి.వి.రమణ, జె.వి.రమణ, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

వరి విత్తన మొలక శాతం ఆశాజనకం

రోలుగుంట: ఖరీఫ్ సాగు కోసం రైతులకు సరఫరా చేసే వరి విత్తనాలకు వ్యవసాయాధికారులు మొలక పరీక్ష చేశారు. మొలక శాతం ఆశాజనకంగా ఉన్నట్టు నిర్ధారించుకున్నారు. మూడు రోజులుగా మండల వ్యవసాయాధికారి ఏర్పాటు చేసిన విత్తన కేంద్రాల నుంచి రైతులకు వరి విత్తనాల పంపిణీ చేస్తున్నారు. విత్తనాల సరఫరాకు ముందుగా వారికి పలు సూచనలు చేస్తున్నారు. విత్తనాల్లో వంద గింజలు మొలక కట్టుకుని వాటిలో 85 గింజల వరకూ మొలకెత్తినట్టు నిర్ధారించుకున్న తర్వాత మాత్రమే ఆకుపోత వేసుకోవాలని ఏవో ఎస్.విజయలక్ష్మి, సచివాలయాల వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.